## విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.09.07.2018.**

# ఆత్కూరు కేంద్రంగా పోలీసు సేవలు ప్రారంభం

విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న శాంతి భద్రతలు మరియు రాజకీయ వైరి వర్గాల స్థానికతను దృష్టిలో ఉంచుకుని మరియు జాతీయ రహదారి ఆనుకున్న ఉన్న పెదవుటుపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు మరియు నారా అప్పారావుపేట గ్రామాలు మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున సత్వర పోలీసు సేవలు అందించేందుకు విజయవాడ పోలీస్ కమీషనర్ వారి విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పైన ఉదహరించిన ఉంగుటూరు మండలం పరిధిలోని గ్రామాలను మరియు శరవేగంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న గన్నవరం మండలం పరిధిలోని చినవుటుపల్లి, వీరపనేని గూడెం, మెట్లపల్లి, బల్లిపర్రు మరియు తెంపల్లి గ్రామాలను కలిపి ఆత్కూరు కేంద్రంగా పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి జిఓ ఎంస్ నెం.15, హోమ్ సర్వీసెస్ (III), తేది.31.01.2018 ప్రకారం ఉత్తర్వులు ఇవ్వడమైనది.

ఈ జీవో ప్రకారం పోలీస్‌స్టేషన్‌కు ఒక ఎస్.ఐ. (ఎస్.హెచ్.ఓ.), 2 ఏఎస్ఐలు, 5 గురు హెడ్‌కానిస్టేబుళ్ళు మరియు 37 మంది పోలీస్ కానిస్టేబుళ్ళను కేటాయించడం జరిగింది. అలాగే పోలీస్‌స్టేషన్ భవనానికి ఆత్కూరు గ్రామంలో 1/2 ఎకరం భూమిని, భవన నిర్మాణము మరియు మౌలిక సదుపాయాల కోసం రూ.1.40 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగింది.

ది.2.2.18న నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం నిమిత్తం గౌరవనీయులైన భారత ఉపరాష్ట్రపతి వర్యులు ఆత్కూరు గ్రామంలో పోలీస్‌స్టేషన్ శంకుస్థాపన చేయడం జరిగింది. భవన నిర్మాణం పూర్తి అయ్యే వరకు పోలీసు సేవలు అందించడం ఈ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మూడు గదుల భవనం నుండి పోలీస్ సేవలను అందించడం జరుగుతుంది. త్వరలో మౌళిక సదుపాయాలతో పూర్తి స్థాయిలో పోలీస్‌స్టేషన్ నిర్మించి పూర్తి స్థాయిలో సిబ్బందిని కేటాయించడం ద్వారా ప్రజలకు సేవలు అందించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ది.09.07.2018న ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా మరియు పైన ఉదహరించిన గ్రామాల్లో ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువలో అందించాలనే ఉద్దేశ్యంతో విజయవాడ పోలీసులు ఆత్కూరు కేంద్రంగా ఒక ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, 5 మంది హెడ్‌కానిస్టేబుళ్ళు మరియు 10 మంది పోలీస్ కానిస్టేబుళ్ళతో పోలీసు సేవలు ప్రారంభించడం జరిగింది.

ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పోలీసు సేవల్లో ప్రజలు మరియు సమాజ భాగస్వామ్యంతో మరిన్ని విజయాలు సాధించి శాంతి భద్రతల సుస్థిరతకు దోహదం చేయడం జరుగుతుంది. ఇందుకు అనుగుణంగా విజయవాడ పోలీసులు గత మూడు సంవత్సరాల కాలంగా పోలీసు విధులలో ప్రజలను భాగస్వాములుగా చేస్తూ అనేక రకాల సామాజిక సేవల ద్వారా ప్రజలకు చేరువయి మరిన్ని సేవలు అందించడం జరిగింది. శాంతి భద్రతలను పరిరక్షించేందుకు, నేరాలను కట్టడి చేయడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం జరుగుతుంది. ఇటువంటి వసతులు ఆత్కూరు పోలీసు సేవలలో ప్రతిభింబిస్తాయి.

*(మిగతా 2వ పేజీలో ...)*

ఈ సందర్భంగా గౌరవ భారత ఉపరాష్ట్రపతి వర్యులు శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారు ఆత్కూరు గ్రామ పర్యటన సందర్భంగా ఈ పోలీసు సేవల ప్రారంభోత్సవాన్ని తిలకించి, పోలీసులకు అభినందనలు తెలియజేస్తూ ప్రజా సేవకు పోలీసులు పునరంకితం అవ్వాలని దిశా, నిర్ధేశం చేశారు.

ఆయన మాట్లాడుతూ... జాతీయ రహదారికి అనుకూలంగా ఒక పోలీస్‌స్టేషన్ ఆవశ్యత ఉందని తెలిజేయగా అందుకు స్పందించి తగిన ఏర్పాట్లతో పోలీస్‌స్టేషన్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. పోలీస్‌స్టేషన్‌లను ఆశ్రయించే బాధితులకు న్యాయం జరిగి, వారు సంతోషంగా వెళ్ళేలా వ్యవహరించాలని పేర్కొంటూ, తప్పులు చేయకుండా, చట్టాన్ని అతిక్రమించకుండా నడుచుకుంటూ ప్రజలు వీలైనంత వరకు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించకుండా ఉండాలని కోరుకున్నారు.

మన దేశంలో చట్టాన్ని దిక్కరించే వ్యక్తులకు వంతపలివే వాళ్ళు అధికంగా ఉంటారని తెలియజేస్తూ, తప్పు చేసిన వ్యక్తులకు శిక్ష మరియు అన్యాయం జరిగిన బాధితులకు న్యాయం చేసే విధంగా పోలీసులు వ్యవహరించాలన్నారు. అలాగే ప్రజలు చట్టాన్ని గౌరవించడం విధిగా అలవాటు చేసుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జీవన విధానాన్ని మార్చుకుంటూ పోలీసులు ప్రజలకు మిత్రులుగా చేరువ కావాలని ఉపరాష్ట్రపతి గారు కోరారు. తాను వివిధ ప్రాంతాల పర్యటన నిమిత్తం అనేక మంది పోలీస్ అధికారులతో మాట్లాడటం జరిగిందని, తాను పరిశీలించిన అధికారులతో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో గాని సేవలు అందించే విషయంలో గాని ఉత్తమ పోలీస్ అధికారిగా విజయవాడ పోలీస్ కమీషనర్ గారిని చూశానని అభినందించారు.

ఈ సందర్భంగా ఎక్కడికి వెళ్ళినా కూడా తాను మాతృ బాషకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలియజేస్తూ, పోలీస్‌స్టేషన్ ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో నిర్వహిస్తూ పరిపాలన సాగించాలని ఆయన సలహా అందించారు.

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ శ్రీ డా॥కోడెల శివప్రసాద్ గారు, మంత్రి వర్యులు శ్రీ కొల్లు రవీంధ్ర మరియు శ్రీ కామినేని శ్రీనివాస్ గార్లు, విజయవాడ పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారు, జాయింట్ పోలీస్ కమీషనర్ శ్రీ టి.కాంతి రాణ ఐపిఎస్, లా&ఆర్డర్-1 డిసిపి శ్రీ డా॥గజరావు భూపాల్ ఐపిఎస్, అడ్మిన్ డిసిపి శ్రీ జె.బ్రహ్మారెడ్డి ఐపిఎస్ మరియు పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

-- xx --